క్లుప్తంగా

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా



ఆగిరిపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతుల భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కాకపోవడంతో రైతులు రుణాలు పొందడానికి పలు అవస్థలు పడుతున్నారన్నారు. అర్హులైన పేదలకు నివాస స్థలాలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏపూరి రవీంద్ర, గంటా పాపారావు, షేక్ జహంగీర్ భాష, సత్తు కోటేశ్వరరావు, గోపాలరావు, శిరీష, సామ్రాజ్యం పాల్గొన్నారు.

ఉత్తర ద్వారం దర్వాజ పునఃప్రతిష్ఠ



చాట్రాయి: చనుబండ గ్రామంలోని కోదండ రామాలయంలో గురువారం ఉత్తర ద్వారం రాతి దర్వాజ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కొత్త గుండ్ల ప్రసాదరావు 1980లో ఉత్తర ద్వారాన్ని నిర్మించారు. ద్వారం శిథిలావస్థకు చేరడంతో దాతలు కృష్ణ వంశీ, వంశీ కృష్ణ, డాక్టర్ రాజగోపాల్ దంపతుల సహకారంతో రూ.8 లక్షలతో తయారు చేసిన రాతి దర్వాజను పునఃప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి, జల్లేపల్లి సుబ్బారావు, కొత్తగుండ్ల విశ్వనాథ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయిని కృపావతికి సన్మానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయిని చిరివెళ్ల కృపావతిని మానవ హక్కుల జాతీయ అధ్యక్షుడు బొడ్డపాటి దాసు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు బట్టపర్తి రాజు గురువారం ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. ఉపాధ్యాయిని కృపావతి గత నెల 30న దుబాయిలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సమాజంలో మంచిగా జీవించటం ఎలా, సమస్యల నుంచి బయట పడటం ఎలా అనే అంశంపై సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ గురు గౌరవ్ విశిష్ట పురస్కార్ అవార్డుతో సన్మానించారు. 28 ఏళ్లుగా విద్య, సామాజిక ,సాంస్కృతిక, సేవల్లో ఆమె పాలుపంచుకున్నారు. ప్రస్తుతం రెడ్డిగూడెం మండలం కుదప జెడ్పీ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయినిగా ఆమె పనిచేస్తున్నారు.

ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా జశ్విక



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డీఏవీ పాఠశాల ఒకటో తరగతి విద్యార్థిని జశ్విక ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు ఎంపికై ంది. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఆయుష్ రిసార్ట్స్ ఆర్గనైజేషన్ వారు 4–6 ఏళ్ల వయస్సు గల బాలలకు గురువారం నిర్వహించిన ప్రిన్స్, ప్రిన్సెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభతో జశ్విక విజేతగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్మోహన్ తెలిపారు. రూ.లక్ష గిఫ్ట్ ఓచర్‌తో పాటు షీల్డ్, బంగారు పతకం, సర్టిఫికెట్ ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా బాలికను ఉపాధ్యాయులు అభినందించారు.

ముందుకు పారని మురుగు



ఆగిరిపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక మూడో రోడ్డులో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో ఉన్న మురుగు నీరు వెళ్లే దారి లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది, జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పాలకులకు, సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- నిబంధనలతో రైతుల ఇబ్బందులు
- సాగు విస్తీర్ణం 22,756 ఎకరాలు
- నియోజకవర్గంలో 14,640 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

నూజివీడు: నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 14,640 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 38 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు. దీనిలో ఏ గ్రేడ్ ధాన్యం 13,049 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం ధాన్యం 1590 మెట్రిక్ టన్నులు. చాట్రాయి మండలంలో 13 కేంద్రాలు, ముసునూరు మండలంలో 11 కేంద్రాలు, నూజివీడు మండలంలో ఏడు కేంద్రాలు, ఆగిరిపల్లి మండలంలో ఏడు కేంద్రాల చొప్పున ఏర్పాటు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో నియోజక వర్గ వ్యాప్తంగా 22,756 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి సాధారణ రకానికి 75 కిలోల బస్తాకు రూ.1,725, ఏ గ్రేడ్ రకం ధాన్యానికి 75 కిలోల బస్తాకు రూ.1,740 ప్రభుత్వం చెల్లిస్తోంది.

దళారులకు విక్రయం

ధాన్యం కొనుగోళ్లలో నిబంధనలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు వాపోతున్నారు. తేమ 17 శాతం కంటే ఎక్కువ ఉంటే కొనుగోలు చేయడం లేదని, దీంతో తుపాను కారణంగా ముసురు నెలకొన్న నేపథ్యంలో ఆరబెట్టుకునేందుకు స్థలాలు లేక, కప్పేందుకు పట్టాలు లేక పలు చోట్ల రైతులు వచ్చిన ధరకే దళారులకు అమ్మేసుకున్నారు. దీంతో దళారులు బస్తాకు రూ.1,400 నుంచి రూ.1,450 మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న గిట్టుబాటు ధరతో పోలిస్తే బస్తాకు రైతులు రూ.275 నుంచి రూ.325 వరకు నష్టపోతున్నారు. ముసునూరు మండలం చెక్కపల్లి, లోపూడి, అక్కిరెడ్డిగూడెం, ముసునూరు, గోపవరం, కాట్రేనిపాడు, వేల్పుచర్ల, కొర్లగుంట తదితర గ్రామాల్లో దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 40 నుంచి 50 శాతం వరకు మాత్రమే వరికోతలు పూర్తి కాగా, తుపాను కారణంగా ఇటీవల నాలుగు రోజులు వరి కోతలు, నూర్పిళ్లను రైతులు నిలిపివేశారు.

నియోజకవర్గంలో వరి సాగు విస్తీర్ణం ఎకరాల్లో

మండలం	విస్తీర్ణం
నూజివీడు	2,842
ఆగిరిపల్లి	3,983
ముసునూరు	5,430
చాట్రాయి	10,501
మొత్తం	22,756

తేమ శాతం అంటూ ఇబ్బంది పెడుతున్నారు



ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉందని రైతులను ఇబ్బంది పెడుతున్నారు. వర్షం పడుతుందేమోననే ఆందోళనతో రైతులు దళారులు ఎవరైనా కొంటామని వస్తే అమ్మేస్తున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వలేదు. వాతావరణం ముసురుగా ఉండటంతో ఆరబెట్టినా ఫలితం లేదు. తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి.

–పాలేటి సుభాష్ చంద్రబోస్, రైతు సంఘం మండల కార్యదర్శి

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు



దళారుల ప్రమేయం లేకుండా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. బ్యాంకు ఖాతా నంబర్, ఎన్‌పీసీఐకు లింక్ అయి ఉంటే విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదును జమ చేస్తోంది. ఇతర కారణాలు ఏమైనా ఉంటే మాత్రం జాప్యం అయ్యే అవకాశాలున్నాయి.

–జి.విద్యాసాగర్, ఏడీఏ, నూజివీడు

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత



మైలవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

మైలవరం: ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో చెట్టు దత్తత కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక చెట్టును దత్తత తీసుకోవాలన్నారు. చెట్టుకు నీరు పోయడం, ఎరువులు వేయడం, చుట్టూ శుభ్రం చేసి కాపాడటం వంటి పనులను చేవడ తారని వివరించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, ప్రకృతి క్లబ్ కో–ఆర్డినేటర్లు డాక్టర్ షహీదా నీలోఫర్, డాక్టర్ వి. భాగ్యలక్ష్మి, ప్రకృతి క్లబ్ స్టూడెంట్ కో–ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **మైలవరం:** మైలవరం డివిజన్ వ్యవసాయ శాఖ పరిధిలోని అన్ని ఆర్ఎస్‌కేలలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు (రెగ్యులర్) ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పిల్లిపెసర, పశువుల ఎరువు, వానపాముల ఎరువు నేలకు వేయడం ద్వారా సేంద్రియ కర్బనం పెంచుకోవచ్చన్నారు. తద్వారా సూక్ష్మ పోషక లోపాలు సవరించుకొని ఆరోగ్య కరమైన పంట పండించవచ్చని వివరించారు.

నేలలను సంరక్షించుకోవాలి

నూజివీడు: నేలలు నిస్సారమవకుండా సంరక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని నూజివీడు ఏడీఏ జి.విద్యాసాగర్ పేర్కొన్నారు. ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తుక్కులూరు రైతుసేవా కేంద్రంలో రైతులకు నేల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు మట్టి నమూనాలను ల్యాబ్‌లకు పంపి భూసార పరీక్ష ఫలితాలను బట్టి రసాయన ఎరువులను అవసరం మేరకే ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం క్షేత్ర పర్యటన చేసి మట్టి నమూనాలను తీసుకోవడంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓలు ఆలేరు చాముండేశ్వరి, సూరిబాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **జూపూడి(ఇబ్రహీంపట్నం):** వ్యవసాయ భూములు ఆరోగ్యంగా ఉండేందుకు కాంప్లెక్స్ ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ మాధవీలత తెలిపారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా జూపూడిలో రైతులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేలలో సేంద్రియ పదార్థం పెంపునకు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. మైలవరం వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఏఓ శైలజ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

● **విస్సన్నపేట:** విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి స్థానిక రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. భూసార రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మోనీషా, ఏఓలు రాజ్యలక్ష్మి, ఆర్. సురేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయం



జి.కొండూరు ఎంఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఇబ్రహీంపట్నం: కడప జిల్లా రాయచోటి మండలం కొత్తపాలెం ఉర్దూ పాఠశాల విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మరణించడంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సయ్యద్ ఖాసీం మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ–2 శ్యాం రత్నబాబుకు వినతిపత్రం అందజేశారు. మండల శాఖ సభ్యులు శ్రీనివాసరావు, నరేంద్ర, ఆర్మ్‌స్ట్రాంగ్, రెడ్‌స్టార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

● **మైలవరం:** రెడ్డిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం మానవహారం ఏర్పాటు చేసి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎస్టీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి అనుగ్రహ ప్రసాద్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కె. రవిబాబు, పీఆర్టీయూ నాయకుడు శివశంకర్ కుమార్ మాట్లాడారు. అనంతరం ఎంఈఓ పి. రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

● **మైలవరం:** విద్య నేర్పించే గురువులపై దాడి చేయడం హేయమైన చర్య అని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య అన్నారు. జి.కొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం మానవహారం ఏర్పాటు చేసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎంఈఓ పీవీ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. పీఆర్టీయూ జిల్లా నాయకులు ఎస్. రాఘవరాజు, యూటీఎఫ్ నాయకులు ఎం. లలిత, వి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

● **ముసునూరు:** చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్లరిబ్బన్లతో నిరసన తెలిపారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల ప్రాణాలకే రక్షణ లేకపోవడం అత్యంత బాధాకరమని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు అన్నారు. హెచ్ఎం అబ్బాస్, రాజశేఖర్, కళాధర్, పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికర భోజనం అందించాలి

తిరువూరు ఆర్డీఓ మాధురి



గంపలగూడెం కేజీబీవీ హాస్టల్లో భోజనం తింటున్న ఆర్డీఓ మాధురి

గంపలగూడెం: కేజీబీవీని తిరువూరు ఆర్డీఓ మాధురి తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలవుతుంది, లేనిది చూశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన శుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన..

మండలంలోని కనుమూరు, కొత్తపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీఓ తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతాంగం నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి తగిన మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 1262 రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ఈ సందర్భంగా రైతులకు వివరించారు. తహసీల్దార్ రాజకుమారి, వీరభద్రం, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కట్టలేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను తిరువూరు ఆర్డీఓ మాధురి గురువారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కనుమూరు, కొత్తపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించేందుకు వెళుతున్న సందర్భంగా ఇసుకలోడుతో వస్తున్న ట్రాక్టర్లను ఆపి పరిశీలించారు. వాటికి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి అపరాధ రుసుం విధించాలని తహసీల్దార్ రాజకుమారి ఆదేశించారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

ఉద్యాన శాఖాధికారి సొహైల్ అహ్మద్



రైతులకు అవగాహన కల్పిస్తున్న సొహైల్ అహ్మద్

తిరువూరు: దీర్ఘకాలం అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని తిరువూరు ఉద్యాన శాఖాధికారి సొహైల్ అహ్మద్ అన్నారు. లక్ష్మీపురం, చిట్టేల, ఆంజనేయపురం గ్రామాల్లో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెట్ట వ్యవసాయం అధికంగా ఉన్న తిరువూరు నియోజక వర్గంలో నీటి వనరులు ఉన్న తోటల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని వివరించారు. పతంజలి ఫుడ్స్ సహకారంతో ఉద్యాన శాఖ ఆయిల్ పామ్ మొక్కలను ఔత్సాహిక రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోందని, సాగు ఖర్చుల నిమిత్తం ఏడాదికి హెక్టారుకు రూ.5,250 చొప్పున రాయితీ కల్పిస్తామని చెప్పారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగుకు కూడా రాయితీ వర్తిస్తుందన్నారు. సూక్ష్మ సేద్య పథకంలో ఉద్యాన పంటలకు, మొక్కజొన్నకు ఐదు ఎకరాల లోపు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాల పైన సాగు చేసే రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందజేస్తామని చెప్పారు. ఆరుతడి పంటలైన అపరాల్లో 50 శాతం రాయితీతో స్ప్రింక్లర్లను అందిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేరెంట్స్ సమావేశం విజయవంతం చేయండి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ఈనెల 7న తలపెట్టిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సునీత శర్మ పేర్కొన్నారు. ఎంపీపీ కార్యాలయంలో మండల పరిధిలోని జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహణపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసే దిశగా తల్లిదండ్రులు, గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. మెరుగైన విద్య పిల్లలకు అందించే దిశగా హోలీస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఎంఈఓ సీహెచ్ పుష్పలత, ఎంఈఓ–2 శ్యాం రత్నబాబు పాల్గొన్నారు.

● **ముసునూరు:** పేరెంట్స్, టీచర్స్ సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు కోరారు. గురువారం మండల విద్యా శాఖ కార్యాలయంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ నెల ఏడో తేదీన మండలంలోని 62 పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

కొత్త పనులకు ప్రాధాన్యం

విస్సన్నపేట: ఉపాధి హామీ పథకంలో కొత్త పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డ్వామా పీడీ పి. రాము అన్నారు. స్థానిక వెలుగు సమావేశ హాల్‌లో విస్సన్నపేట క్లస్టర్ పరిధిలో విస్సన్నపేట, తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు, రెడ్డిగూడెం మండలాలకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు గురువారం సమావేశం నిర్వహించారు. నూతనంగా చేపట్టనున్న పనులపై వారికి అవగాహన కల్పించారు. కూలీలకు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చేకుచినరాట్నాలు, ఏపీడీ పార్థసారథి, ఏపీఓలు పాల్గొన్నారు.

జనవరి 3 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



తిరువూరులో విలేకరులతో మాట్లాడుతున్న డీవీ కృష్ణ

తిరువూరు: సీపీఎం జిల్లా మహాసభలు తిరువూరులో జనవరి 3,4,5 తేదీల్లో జరగనున్నాయని ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ తెలిపారు. మహాసభల ఏర్పాట్లను పరిశీలించేందుకు గురువారం తిరువూరు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజలపై పన్నుల భారాన్ని తగ్గిస్తామని ఆర్భాటంగా ఎన్నికలకు ముందు 'బాదుడే బాదుడు' కార్యక్రమం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజలపై భారాలు మోపితే సహించబోమని గతంలో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాము భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంలో నోరు మెదపకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చేవరకే ప్రజలపై ప్రేమ వలకబోస్తూ వచ్చిన తర్వాత ఇష్టారాజ్యంగా పాలిస్తామన్న చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో సీపీఎం మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎస్. నాగేశ్వరరెడ్డి, కార్యదర్శి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి యోగా శిక్షణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండపల్లి బి కాలనీ ఆడిటోరియంలో ఈనెల 8 నుంచి 23వ తేదీ వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు లంకే జనార్దన్ గురువారం తెలిపారు. ఉదయం, సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల వరకు రెండు పూటలా శిక్షణ ఉంటుందన్నారు. యోగా, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు చేయడం ద్వారా వివిధ దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయన్నారు. ఆసక్తి గలవారు సెల్: 63014 54859 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం



సి గుడిపాడులో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

చాట్రాయి: అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనుల అసంపూర్తిగా నిలిచిపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని సి గుడిపాడు దళితవాడలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి 2006లో రూ.1.50 లక్షలు మంజూరు కావడంతో అప్పటి మంత్రి కోనేరు రంగారావు శంకుస్థాపన చేశారు. పలు కారణాల వల్ల అసంపూర్తిగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కేంద్రం నిర్వహణకు అసంపూర్తి భవనం అనుకూలంగా లేకపోవడంతో దగ్గరలోని ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నారు. స్కూల్లో విద్యార్థులకు గదులు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని వేరొక చోటుకు తరలించాలని ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు ఒత్తిడి తెస్తున్నారు. కనీసం అద్దె ఇల్లు కూడా ఆ ప్రదేశంలో దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో స్థానికులు సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, మంత్రి పార్థసారథికి విన్నవించారు. మంత్రి ఆదేశాలతో తహసీల్దార్ ప్రశాంతి, టీడీపీ నాయకులు అసంపూర్తి భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భూసార పరీక్షల కార్డుల అందజేత

లక్ష్మీపురం(తిరువూరురూరల్): లక్ష్మీపురం రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు భూ సార పరీక్షల కార్డులు అందజేశారు. మండల వ్యవసాయాధికారి పద్మ మాట్లాడుతూ ఈ కార్డుల ప్రయోజనాలను వివరించారు. సర్పంచి గొల్లమండల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం



కంచికచర్ల: రైతులు దళారుల చేతిలో మోసపోకుండా పత్తిని భారత పత్తి సంస్థ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, అప్పుడే మద్దతు ధర లభిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ప్రతినిధులతో కలిసి గురువారం ఆమె కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీఐ పత్తి క్వింటాకు రూ. 7,521 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. పత్తి కొనుగోళ్లలో ఎటువంటి అవకతవకలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీసీఐ బయ్యర్ నాయక్, ఏఎంసీ కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

గంపలగూడెం: రెవెన్యూ గ్రామ సభలు శుక్రవారం నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు మండలంలో నిర్వహిస్తామని తహసిల్దార్ రాజకుమారి తెలిపారు. శుక్రవారం కొణిజెర్ల, 7న ఉమ్మడ దేవరపల్లి, 9న తునికిపాడు, 10న దుందిరాలపాడు, 11న గోసవీడు, 12న మేడూరు, 13న ఊటుకూరు, 16న పెనుగొలను, 17న ఆర్లపాడు, 18న లింగాల, 19న చెన్నవరంలో సభలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 20న అనుముల్లంక, 21న వినగడప, 23న నారికంపాడు, 27న గంపలగూడెం, 28న కొత్తపల్లి, 30న పెద్దకొమిర, 2025 జనవరి 3న రాజవరం, 4న గుల్లపూడి, 7న నెమలి, 8న కనుమూరు గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు. గ్రామ సచివాలయాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సభలు జరుగుతాయని చెప్పారు.

● **ఆగిరిపల్లి:** మండలంలోని గ్రామాల్లో ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సభలు నిర్వహిస్తామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ సభలను రైతులు వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. శుక్రవారం ఆగిరిపల్లి సచివాలయంలో రెవెన్యూ సభ జరుగుతుందని చెప్పారు.

● **ముసునూరు:** రెవెన్యూ సదస్సులు శుక్రవారం నుంచి మండలంలో నిర్వహిస్తామని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు.శుక్రవారం రమణక్కపేట, 10న సూరేపల్లి, 12న అక్కిరెడ్డిగూడెం, 13న చెక్కపల్లి, 17న లోపూడి, 18న చింతలవల్లి, 19న కొర్లగుంట, 20న ముసునూరు, 24న కాట్రేనిపాడు, 27న గోపవరం, 30న గుళ్లపూడి, 31న వలసపల్లి, జనవరి 2న యల్లాపురం, 4న బలివే, 7న వేల్పుచర్ల, 8న చిల్లబోయినపల్లిల్లో సదస్సులు జరుగుతాయని వివరించారు.

కరపత్రాల ఆవిష్కరణ

గంపలగూడెం: దేవాలయాల రక్షణ కోసం జనవరి 5వ తేదీన విజయవాడలో జరుగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కోరారు. బహిరంగ సభ కరపత్రాలను స్థానిక వర్తక సంఘం భవనంలో గురువారం సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ మండల ప్రతినిధులు చారుగుండ్ల సుబ్బారావు, నేరెళ్ల యుగంధర్, అన్నవరపు క్రాంతి పాల్గొన్నారు.

ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని వినతి

నూజివీడు: పన్నెండవ పీఆర్సీ పెండింగ్‌లో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్‌ను ఇవ్వాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూజివీడు ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘ సమావేశం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో గురువారం బీఎం సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పింఛన్‌దారులకు నగదు రహిత వైద్యసేవలు అందేలా చూడాలని కోరారు.